## రెండు కొత్త బార్‌ల దరఖాస్తు అవకాశం

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నందగోపాల్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో రెండు నూతన బార్ లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కెజి నంద గోపాల్ కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్ లో ఒక బార్ కు, బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఒక కొత్త బార్ లైసెన్సుల మంజూరికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. 2005 ఎక్సైజ్ నిబంధనల ప్రకారం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా మూతపడిన 25 బార్ల స్థానంలో కొత్త బార్లకు అనుమతి ఇవ్వగా జిల్లాలో రెండు బార్లకు అనుమతి ఇచ్చారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 26లోపు కలెక్టరేట్ లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కానీ రాష్ట్ర కార్యాలయంలో, హైదరాబాద్ లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల మధ్య సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు రుసుముగా ఒక లక్ష రూపాయలు కాగా ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం ఉందన్నారు. 29న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ (https://tgbcl.telangana.gov.in) లో సందర్శించవచ్చునని, మరిన్ని వివరాలకు 87127 58773, 8712658788, 8712658785 నెంబర్లలో సంప్రదించ వచ్చునన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట సీఐలు గురువయ్య, ఇంద్రప్రసాద్, హరి, సమ్మయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల పొలంబాట



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

మండలంలోనిచాకలివానిపల్లిలో విద్యుత్ అధికారులు రైతులతో కలసి శనివారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల దగ్గర విద్యుత్ ప్రమాదాలపై, మోటార్ లకు కెపాసిటర్లు వాడటం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ సంబంధించిన సమస్యలు ఉంటే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కరీంనగర్ డిఈ ఉపేందర్, ఏడీఈ నరేందర్, ఏఈ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

## టెట్ ఎడ్ తో ఆంగ్ల భాషా నైపుణ్యం



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

ఆంగ్ల భాష నైపుణ్యం పెంపొందించుకోవడానికి టెట్ఎడ్ ఎంతోగానో ఉపయోగపడుతుందని ఎంఈవో రామయ్య అన్నారు. మండలంలోని జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టెట్ ఎడ్ లైసెన్స్ ఉపయోగించుకొని ఆంగ్ల భాషలో వివిధ అంశాలపై అనర్గళంగా ఉపన్యసించి వీడియోలను టెట్ఎడ్ లో అప్ లోడ్ చేసినందుకు టెట్ఎడ్ న్యూయార్క్ వారు విద్యార్థులు హాసిని, సాత్విక, వర్షిణి, శ్రీజ, దీక్షితల ప్రతిభను గుర్తించి, అభినందిస్తూ టెట్ఎడ్ అప్రిసియేషన్ సర్టిఫికెట్లు, అలాగే ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, రాజమౌళి లకు ఎడ్యుకేటర్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ప్రధానోపాధ్యాయులు శారదతో కలసి ఎంఈవో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## చిగురుమామిడి ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతలు



**శెనార్తి మీడియా, చిగురుమామిడి**

చిగురుమామిడి మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎస్. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ లో ఎస్బిఐ లో విధులు నిర్వహించిన శ్రీనొవాస్ చిగురుమామిడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన బండి రాజేష్ వీఆర్ కరీంనగర్ కు బదిలీ అయ్యారు.బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్సై ఎస్. శ్రీనివాస్, కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు.

# సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

నిరుపేద కుటుంబాల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో అర్హత గల ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సన్నబియ్యం పంపిణీ, రేషన్కార్డులు, ప్రజల స్పందన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగించాలని, అర్హత గల ప్రతి లబ్దిదారుడికి చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం రేషన్కార్డు కలిగిన కుటుంబాలలోని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ కార్డులు కలిగిన పేద ప్రజలందరికీ ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి నిరుపేదకు అందాలని, సన్నబియ్యం రవాణాకు సంబంధించి అదనపు లారీలను సమకూర్చుకోవాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్దిదారుల ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతో తయారు చేసిన ఆహారాన్ని లబ్దిదారులతో కలిసి స్వీకరించాలని, సన్న బియ్యం పంపిణీపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. చౌకధరల దుకాణాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన, గ్రామసభలలో నూతన రేషన్కార్డులు, కార్డులలో పేర్లు మార్పులు, తొలగింపుల కొరకు అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేసి అర్హత గల వారికి త్వరగా రేషన్కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా రేషన్కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చౌకధరల దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి పంపిణీ చేస్తున్నామని, చౌకధరల దుకాణాల వద్ద ప్రజల సౌకర్యార్థం త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ పట్ల ప్రజల నుండి మంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నూతన రేషన్కార్డులు, కార్డులు పేర్ల మార్పులు, తొలగింపుల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి అర్హత గల వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లపై సమీక్ష : 67 మందిపై కేసుల రద్దు

- మారిన వారికి అవకాశమిస్తామని ఏఎస్పీ చిత్తరంజన్



**శెనార్తి మీడియా, ఉమ్మడి ఆదిలాబాద్**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పునరావాసానికి ప్రాధాన్యతనిస్తూ, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ శ్రీ ఎస్. చిత్తరంజన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. సబ్ డివిజన్‌లో నమోదైన 368 హిస్టరీ షీట్లలో 67 కేసులను (59 అనుమానితులు, 8 రౌడీషీట్లు) రద్దు చేశారు. గత పదేళ్లుగా నేరాలకు దూరంగా ఉన్న, వృద్ధులు, అంగవైకల్యంతో బాధపడేవారు, సామాజికంగా సజీవంగా ఉన్నవారికి ఇది వరంగా మారింది. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ.. హిస్టరీ షీట్లు శిక్షకాదు, హెచ్చరిక మాత్రమే. మారినవారికి మద్దతు ఇవ్వడం మా లక్ష్యం. మళ్లీ నేర మార్గం చేపడితే కఠిన చర్యలు తప్పవు" అన్నారు. ఇక నేర నివారణలో భాగంగా 80 కొత్త హిస్టరీ షీట్లు (47 అనుమానితులు, 33 రౌడీషీట్లు) నమోదు చేసినట్లు తెలిపారు. మారినవారిని సమాజం అంగీకరించాలని, కొత్త జీవితం ప్రారంభించేందుకు ప్రోత్సహించాలని పోలీసులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు, కేసులు రద్దైన వారు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్..

- మారకపోతే జైలు జీవితం తథ్యం
- మంచిర్యాలలో ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆగ్రహం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ సూచనలతో శుక్రవారం ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లోని అయన కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాష్ ఘాటుగా హెచ్చరిస్తూ, ఇంకా పద్ధతి మారకపోతే... శాశ్వతంగా జైలు గదులకే పంపించడం తప్పదు. నేరస్థులుగా ముద్ర వేయడమే కాకుండా, జీవితాంతం శిక్ష అనుభవించాల్సి వస్తుంది అని స్పష్టం చేశారు. పోలీసుల ఉద్దేశ్యం మారిన వారిని సమాజంలో విలీనం చేయడమేనని, అయినా అప్పటికీ నేరపు మానసికత నుంచి బయటపడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన అన్నారు. కౌన్సిలింగ్ సందర్భంగా పలువురు రౌడీషీటర్లపై గతానికి సంబంధించిన వివరాలు, ప్రస్తుత ప్రవర్తనపై సమీక్ష చేపట్టి, వారిని నేరారహిత జీవితం వైపు మలచేందుకు సూచనలు చేశారు. పోలీసుల ఈ చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, మారిన వారిని సమాజం అంగీకరించాలని, కానీ మారని వారిని కఠినంగా శిక్షించాలంటూ అభిప్రాయపడ్డారు.

# రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఎస్సై రాజశేఖర్
- క్యాతన్‌పల్లి హైవే వద్ద అవగాహన కార్యక్రమం

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్ అన్నారు. గురువారం క్యాతన్‌పల్లి హైవే వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పువ్వులు అందించి, హెల్మెట్, సీటు బెల్టు ఉపయోగించే ప్రాముఖ్యతను వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాష్ డ్రైవింగ్, అతివేగం వల్ల ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. అలాగే వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వాడకాన్ని నివారించాలని సూచించారు. ఈ సదస్సు ద్వారా వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎస్సై లలిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




**శెనార్తి మీడియా, కరీంనగర్**

గ్రామీణ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను పొందాలని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్, ఎంప్లాయ్మెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫీఉల్లా అన్నారు. కరీంనగర్ బ్యాంక్ కాలనీలోని వోల్కసి టెక్నాలజీస్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వాల సంయుక్త ప్రాయోజిత దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియూ -జికే వై) ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామీణ యువత భవిష్యత్తులో లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. శిక్షణను కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తున్న తీరును ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు చేపట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో వోల్కసి టెక్నాలజీస్ డైరెక్టర్ మోతిలాల్ భార్గవ్, సెంటర్ మేనేజర్ మమత, ఈ జి ఎం ఎం ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, రవీందర్, శిక్షకులు అనిల్, రాములు, రాజు, శ్రీనివాస్, మధుకర్, జ్యోతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ఆరు సంవత్సరాల్లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీల్లో పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. నూతన సిలబస్, శిక్షణ పొందిన టీచర్లతో పిల్లలకు మెరుగైన బోధన అందిస్తున్నామని వివరించారు. పిల్లలంతా తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండేలా తల్లిదండ్రులు అంగన్వాడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా పర్లపల్లి గ్రామంలోని మహిళలందరికీ ఉచిత వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ పరీక్షల ద్వారా 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు అందజేస్తామని చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించామని, వచ్చే నెలలో మరోసారి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, శుక్రవారం సభ ద్వారా మహిళలు, పిల్లలకు అందుతున్న పథకాలు, సేవలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, సిడిపిఓ శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

